పురప్రజల ఓటు ప్రత్యేకం..

2



2

క్లియరెన్స్ సర్టిఫికెట్ల కోసం ఆందోళన

AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను మల్టీ జోన్-1 ఐజీపీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షించారు.

29-1-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

పార్టీల అభ్యర్థులు బీఫాంలు సమర్పించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరటుడే, ఆర్మూర్: పార్టీ గుర్తులపై పోటీచేసే అభ్యర్థులు విధిగా బీఫాం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బాలికల కళాశాలలోని నామినేషన్ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బీఫాం సబ్మిట్ చేయని వారిని స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణించడం జరుగుతుందన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36 వార్డులకు బాలికల కళాశాలలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో ఆరు గదులను ఏర్పాటు చేసి రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. నామినేషన్ పత్రాలను మూడు భాషల్లో అందరికీ అందుబాటులో ఉంచామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. పోలింగ్ రోజు వికలాంగులకు ప్రత్యేకంగా వీల్‌చైర్‌లు, ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అభిగ్వాన్ మాల్వియా, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం నామినేషన్ల పరిశీలన చేపట్టాలి: కలెక్టర్

అక్షరటుడే, భీమ్‌గల్ : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో కొన్ని లోపాలను గమనించిన కలెక్టర్, సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, సొంత నిర్ణయాలతో పొరపాట్లు చేయవద్దని హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడైనా రీపోలింగ్‌కు దారితీసే పరిస్థితులు వస్తే, మున్సిపల్ కమిషనర్లనే బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు కావడంతో అభ్యర్థుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, గందరగోళం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్క్రూటినీ సమయంలో నిబంధనలను తప్పక పాటించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా 'బీఫారం' సమర్పించాలని, లేనిపక్షంలో వారిని స్వతంత్రులుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, కమిషనర్లు ఉమామహేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని 50వ డివిజన్ అభ్యర్థిగా బీజేపీ నుంచి చైతన్య కులకర్ణి గురువారం పెద్దబజార్ మున్సిపల్ జోన్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా బీజేపీ కార్యకర్తగా ఉంటూ ప్రజాసేవలో ముందుంటున్నానని తెలిపారు. పార్టీ నుంచి తనకు బీఫాం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మేయర్ పీఠంపై కన్ఫ్యూజన్

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో టికెట్ల కోలాహలం నెలకొంది. మరోవైపు బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు ఆయా పార్టీలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈసారి మేయర్ పీఠం ఎవరు కైవసం చేసుకుంటారనే చర్చ కొనసాగుతోంది. ఎన్నికలల్లో అత్యధిక సీట్లు గెలుచుకుని పీఠం దక్కించుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు పోటీ పడుతున్నాయి. ఇందుకోసం వ్యూహాలు రచిస్తున్నాయి.

– అక్షరటుడే, ఇందూరు

■ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ, కాంగ్రెస్ ■ గెలుపు గుర్రాలకే టికెట్లు

నిజామాబాద్ నగరపాలక సంస్థలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. ఇందులో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 32 సీట్లు అవసరం అవుతాయి. అయితే ప్రధానంగా ఈసారి పోటీ బీజేపీ కాంగ్రెస్ మధ్యే ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ప్రధాన పార్టీల నేతలు సైతం గత ఎన్నికల ఫలితాలను, అభ్యర్థులను బేరీజు వేసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠంపై తమ పార్టీ జెండాను ఎగరవేయాలనే ధృఢ నిశ్చయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు..

మేయర్ పీఠాన్ని కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. మరోవైపు ఎంఐఎం తమ బలంతోనే మేయర్ పీఠం ఎక్కే అవకాశం ఉంటుందని ధీమాగా ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడమే కాకుండా రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా వాసి కావడం, సీనియర్ నాయకులు, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీలు ఉండడంతో ఎట్టి పరిస్థితుల్లో మేయర్‌గా తమ పార్టీ అభ్యర్థే ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున అభివృద్ధి అనే నినాదంతో ముందుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు యోచిస్తున్నారు. మరోవైపు బీజేపీ నుంచి ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఉండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఇరు పార్టీలు బలమైన అభ్యర్థిని నిలబెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు.

మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో..

నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్ రిజర్వేషన్ జనరల్ మహిళకు కేటాయించారు. దీంతో రాజకీయ పార్టీలు ప్రజల్లో పట్టుకున్న మహిళా నాయకులకు పలు డివిజన్లలో టికెట్లు ఇచ్చే పనిలోపడ్డారు. ఇప్పటికే ఆయా పార్టీల్లో పలువురు పేర్లు ప్రస్తావనకు వచ్చాయంటూ చర్చించుకుంటున్నారు. కాగా.. గత రెండు పర్యాయాలు నిజామాబాద్ మేయర్ పదవి మహిళలకు దక్కిన విషయం తెలిసిందే. మరికొద్ది రోజుల్లో కొత్త మేయర్‌గా ఎవరు ఎన్నిక కానున్నారనే తేలిపోనుంది.

గతంలో ఫలితాలు ఇలా..

నగరపాలక సంస్థలో 60 డివిజన్లు ఉండగా.. గత ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 28 సీట్లు, ఎంఐఎం 16, బీఆర్ఎస్ 13, కాంగ్రెస్ 2, స్వతంత్రులు ఒకరు గెలుపొందారు. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఎంఐఎంతో పొత్తు పెట్టుకుని మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే ఈసారి మాత్రం కాంగ్రెస్ తాము అధికారంలో ఉన్నామని, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని, సొంతంగానే మేయర్ పీఠానికి కావాల్సిన సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఎంఐఎం మాత్రం తమ పొత్తు లేనిదే ప్రభుత్వం ఏర్పాటు కాదని అంటోంది. ఇదిలా ఉండగా బీజేపీ మాత్రం గతంలో తృటిలో మేయర్ సీటును చేజార్చుకున్నామని, ఈసారి నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తామంటూ హామీలు ఇస్తూ ముందుకు కదులుతోంది. అలాగే బీఆర్ ఎస్ నాయకులు కూడా ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని తాము అధిక సీట్లు గెలుపొంది మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ

అక్షరటుడే, ఇందూరు: ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు దినేష్ కులచారి నేతృత్వంలో గురువారం నగరంలోని 22వ డివిజన్ నుంచి పలువురు ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనపై ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో 'మన ఇందూరు - మన మేయర్' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిచఆరు. ఎంపీ అర్వింద్ జిల్లాలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. కాగా.. బీజేపీలోకి మాజీ కార్పొరేటర్ పోతుల పురుషోత్తం, తాటికొండ రాము, ఆకుల శ్రీనివాస్ రాజ్ కుమార్, ఆనంద్, శ్రీనివాస్ చేరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని 2వ వార్డుకు చెందిన జర్నలిస్ట్ కుశలకంటి మహేష్, 10వ వార్డుకు చెందిన యునుస్ గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్ రావు సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన గృహంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై బీఆర్ ఎస్ జెండా ఎగురవేయాలన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

అక్షరటుడే, ఇందూరు: జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఓ ప్రకటన విడుదల చేశారు. కంట్రోల్ రూం ఫోన్ 08462- 220183కు కార్యాలయ పనివేళల్లో ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదులను వెనువెంటనే పరిశీలిస్తూ, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

నామినేషన్ సెంటర్‌ను పరిశీలించిన సబ్‌కలెక్టర్

అక్షరటుడే: బోధన్ : బోధన్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలలో నామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం పరిశీలించారు. ప్రతి నామినేషన్ సెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని అభ్యంతరాలుంటే వెంటనే అభ్యర్థులకు తెలపాలని ఆర్‌వోలకు సూచించారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు: ఎస్పీ

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలో మున్సిపల్ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, బారికేడ్లు, పోలీస్ బందోబస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా కార్యాలయంలో ప్రత్యేక బృందం ప్రతి పోస్ట్‌ను నిశితంగా గమనిస్తుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతియుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్నివిధాలా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. శాంతిభద్రతల విఘాతానికి ప్రయత్నించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని.. ప్రజలు లేదా అభ్యర్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ నరహరి, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశించారు. ఈ మేరకు ఎల్లారెడ్డి మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్ల పరిశీలన, పోలీస్ సిబ్బందికి మార్గదర్శకాలను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ వివరాలను మున్సిపల్ కమిషనర్ మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాజిరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలి: పీసీసీ చీఫ్

అక్షరటుడే, ఆర్మూర్: మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో గురువారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని తీసుకోవాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు వినయ్ రెడ్డి, సునీల్ రెడ్డి, అధికార ప్రతినిధి ఏబీ చిన్న, రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్, మానాలా మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, కేశ వేణు, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

అక్షరటుడే, కోటగిరి : గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని సర్పంచ్ కల్లూరి సంధ్య అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సీఎం కప్ కార్యక్రమంలో భాగంగా.. మండలంలోని అన్ని గ్రామాల యువకులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, యోగా, పోటీలను నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో ముందుండాలనే ఉద్దేశంతో సీఎంకప్ పేరుతో పోటీలు నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులు సైతం మెరుగైన ప్రదర్శన ఇచ్చి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వం సైతం ఉత్తమ క్రీడాకారులకు ఎల్లప్పుడూ మద్దతు తెలుపుతుందన్నారు. జిల్లా నుంచి బాక్సింగ్ క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతోందని సర్పంచ్ అన్నారు. హాకీ క్రీడాకారిణి యెండల సౌందర్య సైతం అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ప్రస్తుతం కోచ్‌గా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, ఎంపీడీవో చందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉప్పల శంకర్, పంచాయతీ కార్యదర్శి యాదవ్, ఎజాజ్ ఖాన్, గంట్ల విఠల్, సాయాగౌడ్, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ బీజేపీలో పలువురి చేరిక

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీలో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో 6వ వార్డు నుంచి పుట్టి మురళి దంపతులు,19వ వార్డ్ నుంచి త్రివేణి శ్రీకాంత్ దంపతులు, 25వ వార్డు నుండి వినయ్, 30వ వార్డు నుంచి వినోద్‌తో సహా సుమారు 200మంది బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బాలు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, యమాద్రి భాస్కర్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోచంపాడ్‌లో త్వరలో సెంట్రల్ లైటింగ్

అక్షరటుడే, మెండోరా: పోచంపాడ్ గ్రామంలో త్వరలో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు గ్రామంలో లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు కోసం కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వారంరోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో రహదారి భద్రత, రాత్రివేళల్లో ప్రజలకు సౌకర్యం కల్పించే దిశగా ఈ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి రాజు, ఉపసర్పంచ్ సంపంగి సతీష్, మిస్సా గంగారెడ్డి, రమేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకనాటి నవనాథపురమే.. నేటి ఆర్మూర్. 1956 నుంచి 1962 వరకు మున్సిపాలిటీగా ఉన్న ఆర్మూర్‌ను ఆ తర్వాత మేజర్ గ్రామ పంచాయతీగా మార్చారు. ఇలా 46 ఏళ్లపాటు గ్రామ పంచాయతీగా ఆర్మూర్ కొనసాగింది. 2006 మే 26న ఆర్మూర్‌ను మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మూడో గ్రేడ్ మున్సిపాలిటీగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచింది. అప్పటి నుంచి ఆర్మూర్ ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుహక్కుతో విలక్షణ తీర్పునిస్తున్నారు. – అక్షరటుడే ఆర్మూర్

- ఆర్మూర్‌లో మున్సిపాలిటీలో ఎన్నికల జోరు
- బల్దియా పీఠంపై ప్రధాన పార్టీల కన్ను
- కొలువుదీరనున్న 4వ పాలకవర్గం..

పుర ప్రజల ఓటు

ఎప్పుడూ ప్రత్యేకమే..

ఆర్మూర్‌కు 2008లో తొలిసారి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. మొదటి మున్సిపల్ ఛైర్మన్‌గా 1956 నుంచి 1962 వరకు కేవీ నరసింహారెడ్డి పనిచేశారు. ఆ తర్వాత 2008లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి త్రివేణి గంగాధర్, కంచెట్టి గంగాధర్లు ఐదేళ్లలో చెరిసంగం ఛైర్మన్‌గిరి చేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున విజయం సాధించి స్వాతిసింగ్ బబ్లు ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2019లో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీచేసి విజయం సాధించి పండిత్ వినీత ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మహిళలకే పట్టంగట్టి..

2023లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీంతో వన్నెల్ దేవి లావణ్య 10 నెలల పాటు 2024 వరకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్లుగా ముగ్గురు మహిళలు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ మహిళకు మున్సిపల్ ఛైర్ రిజర్వ్ కావడంతో మూడోసారి ఆర్మూర్ పీఠం ఎవరిని వరిస్తుందో చూడాలి.

36 వార్డులు.. 63,972 ఓటర్లు..

2006లో 23వార్డులతో ఆర్మూర్ మున్సిపాలిటీగా మారింది. 2019లో పెర్కిట్, మామిడిపల్లి మేజర్ గ్రామపంచాయతీలను ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో 36 వార్డులుగా ఏర్పడ్డాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 63,972 ఓటర్లు ఉండగా 33,322 మంది మహిళలు, 30,648 పురుషులు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. 36 వార్డులకు గాను 106 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ప్రస్తుతం నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో కాలనీలో ఎన్నికల సందడి నెలకొంది.

ఆర్మూర్‌ను పాలించింది వీరే...

ఆర్మూర్ మొదటి మున్సిపల్ ఛైర్మన్‌గా కేవీ నరసింహారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీగా మారగా దేవదాస్ శర్మ, అల్జాపూర్ గంగాధర్, దత్తాద్రి, కొంగి సదాశివ్, రామచంద్ర హండేలు సర్పంచులుగా వ్యవహరించారు. 2008 నుంచి త్రివేణి గంగాధర్, కంచెట్టి గంగాధర్, స్వాతి సింగ్ బబ్లూ, పండిత్ వినీత పవన్, వన్నెల దేవి లావణ్య శ్రీనివాస్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఇక తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో ఎవరు ఛైర్మన్‌గా ఎన్నికవుతారో చూడాల్సిందే.

ఆర్మూర్‌లో రెండోరోజు 52 నామినేషన్లు

అక్షరటుడే, ఆర్మూర్: మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌లో భాగంగా ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను రెండోరోజు గురువారం వివిధ వార్డుల్లో 52 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటిరోజు 5 నామినేషన్లు దాఖలు కాగా ఇప్పటి వరకు 57 నామినేషన్లు వచ్చాయి. ఈనెల 30తో నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది. శుక్రవారం చివరిరోజు కావడంతో ఈ సంఖ్య మరింతగా పెరగనుంది. ఆర్మూర్‌లోని నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నియమనిబంధనకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు ఆమె సూచించారు.

అక్రమ మద్యం స్వాధీనం

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని గోల్‌బంగ్లా ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇంటిపై ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం విక్రయిస్తున్న శివకుమార్‌ను పట్టుకొని 15 బీర్లు, 37 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సదరు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్: మండలంలో వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో అభినవ్ చందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో కలెక్టరేట్ ఆదేశాల మేరకు తాగునీటి సరఫరా యాక్షన్‌ప్లాన్ విషయమై సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు తమ గ్రామాల్లో తాగునీటి సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని బాబుల్‌గావ్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కౌలాస్ ప్రాజెక్ట్ నుంచి వస్తున్న నీళ్లు వాడుకుంటే జనాలకు శరీరంలో దద్దుర్లు వస్తున్నాయని దీంతో జనాలు అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు సకాలంలో స్పందించి మంచినీటి సమస్య పరిష్కారం చూపాలన్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీడీవో, మిషన్ భగీరథ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు రాజకీయ కక్ష సాధింపు

అక్షరటుడే, భీమ్‌గల్: తెలంగాణ జాతిపిత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. వేల్పూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గురువారం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర మంత్రివర్గం 'దండుపాళ్యం బ్యాచ్'లా మారిందని, బొగ్గు, సోలార్, ఎక్సైజ్ రంగాల్లో భారీ కుంభకోణాలకు పాల్పడుతోందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు బయటపెట్టిన ఈ స్కామ్‌ల నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను మానసికంగా దెబ్బతీసి, కేసుల చుట్టూ తిప్పాలనేది ప్రభుత్వ వ్యూహమని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు, పెన్షన్ల పెంపుతో కోట్లాది మంది గుండెల్లో నిలిచిన నాయకుడిని అవమానిస్తే తెలంగాణ సమాజం ఊరుకోదని హెచ్చరించారు.

నవవధువు ఆత్మహత్య..

అక్షరటుడే, కామారెడ్డి: పెళ్లయిన రెండు నెలలకే నవ వధువుకు నూరేళ్లు నిండాయి. ఉరి వేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బీబీపేట మండలం జనగామ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన అనూషకు జనగామ గ్రామానికి చెందిన నవీన్‌తో రెండు నెలల క్రితం వివాహమైంది. రెండు నెలల పాటు భార్యాభర్తలు బాగానే ఉన్నారు. పొలం పనుల నిమిత్తం బుధవారం భర్త నవీన్ బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అనూష ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లయి రెండు నెలలు కూడా కాకముందే నవవధువు ఆత్మహత్యకు పాల్పడడం గ్రామంలో కలకలం రేపింది. అయితే అమ్మాయికి ఈ పెళ్లి ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడిందా.. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కెనాల్‌లో బాలిక మృతదేహం లభ్యం

అక్షరటుడే, బోధన్: ఎడపల్లి మండల పరిధిలోని ఏఆర్పీ క్యాంప్ శివారులోని డీ-46 కెనాల్‌లో గుర్తు తెలియని బాలిక మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కెనాల్‌లో గుర్తు తెలియని బాలిక మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే బాలికకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని.. బాలికకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎడపల్లి పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్ 8712659873కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని చిన్న రాంమందిర్ ప్రభుత్వ పాఠశాలలో 2002-03 విద్యాసంవత్సరానికి చెందిన ఏడో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. సుమారు 25 ఏళ్ల తర్వాత సహచర విద్యార్థులందరూ ఒకే చోట చేరడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు, శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంరెడ్డి, సాయన్న, నారాయణ, శోభ, విద్యార్థులు ప్రేమ్ కుమార్, నరేష్, రామ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల కోసం ఆందోళన

అక్షరటుడే, ఆర్మూర్ : మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆర్మూర్ ఏసీపీ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తున్నారంటూ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఒక్క నిమిషంలోనే క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇస్తున్నారని.. బీఆర్ఎస్ అభ్యర్థులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసే నాయకులను కాంగ్రెస్ గుండాలు, రౌడీలు బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. చిన్న, పెద్ద, వసూల్ రెడ్డిలు తమ పద్ధతి మార్చుకోవాలని వ్యాఖ్యానించారు. 17వ వార్డులో బీఆర్ఎస్ నాయకులను బెదిరించిన ఏబీ చిన్నాపై చర్యలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ పదేళ్ల పాలనలో ఇలాచేసి ఉంటే ఏఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా కనబడే వాడు కాదన్నారు. తాను ఎప్పుడూ ఎవరి జోలికి వెళ్లలేదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు డీఎస్పీలు, సీఐలు లేరా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే ప్రజాక్షేత్రంలో నిలబడి తమతో తలపడాలన్నారు. ఆందోళన సమాచారం తెలుసుకున్న ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్ రెడ్డి, నచ్చు చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.